సాక్షి

భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం । 7 । మే । 2025



ఎల్‌సీ ఇక సులభం

సిబ్బందికి మరింతగా సౌకర్యాలు కల్పించేందుకు ఎన్‌పీడీసీఎల్ అధికారులు ఎల్‌సీ యాప్‌ను అందుబాటులో తెచ్చారు. 8లో



'ఉపాధి' సిబ్బందికి ఊరట

ఉపాధి హామీ సిబ్బందికి కాస్త ఊరట లభించింది. ఎట్టకేలకు మూడు నెలల వేతనాలను ప్రభుత్వం విడుదల చేసింది. 8లో

గరిష్టం / కనిష్టం 39°/ 26°

వాతావరణం

జిల్లాలో బుధవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్ని ప్రాంతాల్లో ఉదయం వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రమణీయం.. రామయ్య కల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం రమణీయంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని ఆంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

నేడు మంత్రి పొంగులేటి పర్యటన



భద్రాచలం: రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం భద్రాచలం నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పర్యటించనున్నారు. ఈ మేరకు మంగళవారం అధికారులు షెడ్యూల్ విడుదల చేశారు. ఉదయం 9.20 గంటలకు వాజేడు మండలం టేకులగూడెం, నగరం, ఎడ్జర్లపల్లి, అనంతరం 11.20 గంటల నుంచి వెంకటాపురం మండల కేంద్రం, పాత్రపురం, పాలెంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. మధ్యాహ్నం 1 గంట నుంచి చర్ల మండలంలోని సుబ్బంపేట, లక్ష్మీ కాలనీ, తేగడ గ్రామాల్లో, 3.45 గంటలకు దుమ్ముగూడెం మండలం చిన్న బండిరేవు, సింగవరం, సాయంత్రం 4.45 గంటలకు భద్రాచలం మండలంలో పలు కార్యక్రమాలను ప్రారంభించనున్నారు.

నిర్ణయించిన ఫీజులే వసూలు చేయాలి

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని ల్యాబ్‌లు, ప్రైవేటు ఆస్పత్రుల్లో ప్రజలకు వైద్యసేవలు అందుబాటులో ఉండేలా ఫీజులు నిర్ణయించామని, ఆయా యాజమాన్యాలు ఆ మేరకే వసూలు చేయాలని డీఎంహెచ్ఓ భాస్కర్ నాయక్ సూచించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఫీజుల విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తమ కార్యాలయంలో సంప్రదించాలని ప్రజలను కోరారు.

పట్టెడు కోయ సంస్కృతి పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సీతక్క, చందా లింగయ్య తదితరులు

కరకగూడెం: మండలంలోని వీరాపురానికి చెందిన ఆదివాసీ మహిళ కుంజా వరలక్ష్మి రూపొందించిన పట్టెడు కోయ సంస్కృతి పుస్తకాన్ని హైదరాబాద్‌లో మంత్రి సీతక్క మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. ఆదివాసీ తెగల చరిత్ర మరుగునపడుతున్న సమయంలో, వారి సంస్కృతి సంప్రదాయాలను సజీవంగా నిలిపేందుకు ఈ పుస్తకం దోహదం చేస్తుందని చెప్పారు. పూర్వ కోయ తెగల చరిత్రను జానపద సాహిత్య రూపంలో సమాజానికి పరిచయం చేసిన వరలక్ష్మిని అభినందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య, తెలుగు విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ భట్టు రమేష్, నిజాం కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ ఆప్కా నాగేశ్వరరావు, రచయిత శోభ రమేష్‌తో పాటు గట్టుపల్లి రాంబాబు, వజ్జా నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

21 మంది ఈఅండ్‌ఎం అధికారుల బదిలీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో వివిధ ఏరియాల్లో పనిచేస్తున్న 21 మంది ఈఅండ్‌ఎం అధికారులను బదిలీ చేస్తూ యాజమాన్యం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. వీరిలో ఒక అడిషనల్ జీఎం, ఏడుగురు డీజీఎంలు, 9 మంది ఎస్ఈలు, ఇద్దరు డిప్యూటీ ఎస్ఈలు, ఇద్దరు ఈఈలు ఉన్నారు. వీరంతా ఈ నెల 15వ తేదీ లోగా కేటాయించిన ఏరియాల్లో విధుల్లో చేరాలని యాజమాన్యం ఆదేశించింది.

ముంపు ముప్పుపై.. మరో అధ్యయనం

'పోలవరం'పై వచ్చే నెలలో రీ సర్వేకు అవకాశం

- 2022 వరదతో తారుమారైన గత అంచనాలు
- జీఆర్ఎంబీ వద్ద అభ్యంతరాలు లేవనెత్తిన తెలంగాణ
- ఐఐటీ – హైదరాబాద్‌తో సర్వే చేపట్టాలని నిర్ణయం

2022 గోదావరి వరదలతో నీట మునిగిన భద్రాచలం రామాలయ పరిసర ప్రాంతాలు



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: పోలవరం ప్రాజెక్టు మొదలైన తర్వాత 2022 జూలైలో వచ్చిన వరదలు నదీ పరివాహక ప్రాంతాలకు కొత్త అనుభవాలను చూపించాయి. బ్యాక్ వాటర్ ప్రభావంపై గతంలో వచ్చిన నివేదికల్లో పేర్కొన్న అంచనాలు 'వరద'లో గల్లంతయ్యాయి. దీంతో బ్యాక్ వాటర్ ప్రభావంపై తిరిగి అధ్యయనం చేయాలనే డిమాండ్లు పెరిగాయి.

మరోసారి అధ్యయనం చేయాల్సిందే..

2022 గోదావరి వరదల తర్వాత పోలవరం బ్యాక్ వాటర్ ముంపు ప్రభావంపై మరోసారి అధ్యయనం చేయాల్సిందేనని తెలంగాణ సర్కారు డిమాండ్ చేస్తోంది. పోలవరం ప్రాజెక్టు, గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు సమావేశాల్లో ఈ అంశాన్ని ప్రస్తావిస్తుండగా ఈ అభ్యంతరాలను ఏపీ ప్రభుత్వం కొట్టివేస్తూ వచ్చింది. చివరకు మరో సర్వేకు ఏపీ సర్కారు ఒప్పుకోక తప్పలేదు. ఈ మేరకు సీడబ్ల్యూసీ తరఫున వరద ముంపు ప్రభావంపై సర్వే జరగనుంది. అయితే 2016లో చేపట్టిన సర్వే ఆశించిన ఫలితాలు ఇవ్వకపోవడాన్ని దృష్టిలో ఉంచుకున్న తెలంగాణ సర్కారు.. ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంది. అందులో భాగంగా పోలవరం బ్యాక్ వాటర్ ప్రభావం భద్రాచలం, దుమ్ముగూడెం, బూర్గంపాడు మండలాలపై ఏ మేరకు ఉంటుంది.. కిన్నెరసాని, ముర్రేడు వాగులపై ఎలాంటి ప్రభావం చూపుతుందనే అంశంపై ఐఐటీ – హైదరాబాద్ ఇంజనీర్ల బృందంతో సర్వే చేయించాలని ఇరిగేషన్ శాఖకు గత జనవరి 5న సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి (ఫైల్)

తాజాగా కేంద్ర జల సంఘం సర్వే..

గోదావరికి గరిష్టంగా 50 లక్షల క్యూసెక్కుల వరద వస్తే పోలవరం వెనుక వైపు 146 కి.మీ దూరంలో ఉన్న దుమ్ముగూడెం ఆనకట్ట వరకు ఎలాంటి ప్రభావం ఉంటుందో అధ్యయనం చేయాలని ఐఐటీ – హైదరాబాద్‌ను కోరుతూ రాష్ట్ర ఇరిగేషన్ శాఖ ఈ ఏడాది జనవరి 29న లేఖ రాసింది. దీంతో క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయడానికి ముందు గతంలో ఈ అంశంపై జరిగిన పలు సర్వేలు, ఇతర వివరాలను ఐఐటీ – హైదరాబాద్ సేకరించింది. అయితే అప్పటి నుంచి ఈ అంశంపై పెద్దగా కదలిక కనిపించ లేదు. కాగా గోదావరి వరదలు, వాటి తాలూకు ప్రభావాలను కేంద్ర జల సంఘానికి చెందిన బృందం పినపాక, భద్రాచలం నియోజకవర్గాల పరిధిలో సోమవారం సర్వే చేపట్టింది. దీంతో మరోసారి ఐఐటీ – హైదరాబాద్ సర్వే అంశం తెరపైకి వచ్చింది. దీనిపై ఇంజనీరింగ్ అధికారులను సంప్రదించగా.. సర్వేకు అవసరమైన వివరాలను ఐఐటీ – హైదరాబాద్ బృందానికి అప్పగించామని, వచ్చే నెలలో క్షేత్రస్థాయి సర్వే ప్రారంభమయ్యే అవకాశముందని తెలిపారు.

వరద భయాలు..

పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ప్రభావంపై కేంద్ర జలసంఘం 2016లో సర్వే చేపట్టింది. ఈ ప్రాజెక్టును 46 మీటర్ల ఎత్తు వద్ద గేట్లు మూసి పూర్తి నీటి నిల్వ సామర్థ్యంతో నింపితే ఎంత ముంపు ఉంటుందనే అంచనాకు అధికారులు వచ్చారు. అలాగే రికార్డు స్థాయి వరద వస్తే భద్రాచలం, దుమ్ముగూడెం మండలాల్లో ప్రభావం ఎలా ఉంటుందనే అంశాలపైనా వివరాలు సేకరించారు. 1986లో భద్రాచలం వద్ద వచ్చిన గరిష్ట వరద 35 లక్షల క్యూసెక్కులు, 76 అడుగుల వరకైతే తెలంగాణలో ముంపు ఉండదని అంచనా వేశారు. కానీ 2022 జూలైలో వచ్చిన వరద ఈ అంచనాలను తారుమారు చేసింది. భద్రాచలం వద్ద 24.50 లక్షల క్యూసెక్కుల వరద, 71.60 అడుగులు నమోదు కాగా, ఈ వరదకే జిల్లాలోని 102 గ్రామాల్లో 16 వేల ఇళ్లు ముంపునకు గురయ్యాయి. అంటే 2016 నాటి సీడబ్ల్యూసీ నివేదిక అంచనాలు తప్పాయి. గోదావరి వరద ప్రవాహం కేవలం ఈ నదికే కాకుండా ఉపనది అయిన కిన్నెరసాని, దాని ఉపనదైన ముర్రేడు వాగుపై కూడా కనిపించింది.

వ్యవసాయ వ్యాపారులుగా ఎదగాలి

- ఉద్యోగం కోసం ప్రయత్నించకుండా ఉపాధి కల్పకులుగా మారాలి
- కలెక్టర్ జితేష్ వి పాటిల్



వ్యవసాయ కళాశాల విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

అశ్వారావుపేట: వ్యవసాయ విద్యార్థులు భావి వ్యవసాయ అనుబంధ వ్యాపారులుగా ఎదగాలని, ఉద్యోగం కోసం ప్రయత్నించకుండా పలువురికి ఉపాధి కల్పించేవారుగా మారాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. స్థానిక వ్యవసాయ కళాశాలలో సాగువుతున్న మామిడి, మునగ, ఇతర ఉద్యాన పంటలు, జరుగుతున్న పరిశోధనలను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ.. వ్యవసాయ విద్య అభ్యసించిన తర్వాత ఉద్యోగాన్వేషణ చేయకుండా వ్యవసాయ ఆధారిత పారిశ్రామికవేత్తలుగా, వ్యాపారులుగా ఎదగాలని సూచించారు. తద్వారా ఎంతోమందికి ఉపాధి కల్పించే అవకాశం లభిస్తుందన్నారు. విద్యాభ్యాసంలో భాగంగా గ్రామాల్లో రైతులను కలిసి సూచనలు చేయడమే కాక వారి అనుభవాల నుంచి కూడా పాఠాలు నేర్చుకోవాలన్నారు.

అర్హులకు భూ భారతి పట్టాలు

అశ్వారావుపేట రెవెన్యూ 911, కన్నాయిగూడెం రెవెన్యూ 152 సర్వే నంబర్లలో అర్హులకు భూ భారతి చట్టం ప్రకారం నూతన పట్టాలు జారీ చేస్తామని కలెక్టర్ అన్నారు. జాయింట్ సర్వే ద్వారా సమస్యల పరిష్కరిస్తామని చెప్పారు. ఆ తర్వాత గోగులపూడిలో వెదురు కళాకృతుల తయారీదారులతో మాట్లాడి.. వారి ఆర్థిక అభ్యున్నతికి శిక్షణ, ఇతర సౌకర్యాల కల్పనకు ప్రయత్నిస్తామని అన్నారు. అనంతరం గుబ్బలమంగమ్మ ఆలయాన్ని సందర్శించారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ కృష్ణప్రసాద్, ఏడీఏ రవికుమార్, ఏఓ శివరామప్రసాద్, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, నాయబ్ తహసీల్దార్ సీహెచ్‌వీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వారం లోగా ఇంకుడు గుంతలు పూర్తవ్వాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో వారం రోజుల్లోగా ఇంకుడుగుంతల నిర్మాణాలు పూర్తి చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్ నుంచి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యాలయాలు, ఆస్పత్రులు, విద్యాసంస్థల్లో ఇంకుడుగుంతలు నిర్మించాలన్నారు. వర్షపు నీరు ఎక్కువగా నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి అక్కడే నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. పనులు పూర్తయ్యాక జల్ సంచెయ్ జెన్ భాగీ దారి పోర్టల్‌లో పంచాయతీ కార్యదర్శులతో అప్‌లోడ్ చేయించాలని చెప్పారు. వ్యవసాయ భూముల్లోనూ నిర్మాణాలకు మార్కింగ్ చేయాలని సూచించారు. ఉపాధిహామీ పథకం ద్వారా ఉచితంగా నిర్మాణాలు చేపడతామని, ఈ మేరకు రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు డి వేణుగోపాల్, విద్యాచందన పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ సందర్శన..

ములకలపల్లి : ములకలపల్లి పోలీస్‌స్టేషన్‌ను కలెక్టర్ పాటిల్ మంగళవారం సందర్శించారు. స్టేషన్ ఆవరణలో చేపట్టిన ఇంకుడుగుంతల నిర్మాణాలను పరిశీలించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ వైద్యశాలలు, హెల్త్ సబ్ సెంటర్లు, పోలీస్‌స్టేషన్లలో టాయిలెట్లు నిర్మిస్తామని తెలిపారు. పీహెచ్‌సీని సందర్శించి ఆశా వర్కర్ల పనితీరును కలెక్టర్ అభినందించారు. ఆస్పత్రి చుట్టూ ప్రహరీని వారం రోజుల్లో పూర్తి చేయాలని ఎంపీడీఓ గద్దె రేవతిని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ విద్యాచందన, డీఎంఅండ్‌హెచ్ఓ భాస్కర్ నాయక్, ఎంఈఓ సత్యనారాయణ, డాక్టర్లు సాయికల్యాణ్, కృష్ణదీపక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ సంక్షేమాధికారులకు త్వరలో నియామకపత్రాలు

భద్రాచలం: హాస్టల్ సంక్షేమాధికారుల పోస్టులకు ఎంపికైన వారికి కౌన్సెలింగ్ పూర్తయిందని, త్వరలో నియామక పత్రాలు అందజేస్తామని గిరిజన సంక్షేమ శాఖ డీడీ మణెమ్మ తెలిపారు. మంగళవారం పీఎంఆర్‌సీ భవనంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గతనెల 25న అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలించామని, అనంతరం వాటిని గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ సెక్రటరీ కార్యాలయానికి పంపించామని చెప్పారు. ఉన్నతాధికారుల ఉత్తర్వుల ప్రకారం భద్రాద్రి, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో ఖాళీగా ఉన్న 23 పోస్టులను భర్తీ చేస్తామని వివరించారు. కార్యక్రమంలో ఏసీఎంఓ రమణయ్య, ఏటీడీఓ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

14 మంది మావోయిస్టుల లొంగుబాటు



లొంగిపోయిన మావోయిస్టుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ, అధికారులు

- ఈ ఏడాది ఇప్పటివరకు 227 మంది..
- 130 మందికి పునరావాసం కల్పించామని ఎస్పీ వెల్లడి

కొత్తగూడెంటౌన్ : ఛత్తీస్‌గఢ్‌తో పాటు జిల్లాకు చెందిన 14 మంది మావోయిస్టులు ఎస్పీ రోహిత్‌రాజ్ ఎదుట లొంగిపోయారు. ఈ మేరకు పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వివరాలు వెల్లడించారు. లొంగిపోయిన ఏసీఎం కేడర్ గలవారు ఇద్దరు, నలుగురు పార్టీ సభ్యులు, ముగ్గురు మిలీషియా సభ్యులు, కిసాన్ మజ్దూర్ సంఘ్‌కు చెందిన ఒకరితో పాటు దండకారణ్య కిసాన్ మజ్దూర్ సంఘ్‌కు చెందిన నలుగురు ఉన్నారని, వారిలో ముగ్గురు మహిళలని వివరించారు. హింసకు కాలం చెల్లిందని, మావోయిస్టుల సిద్ధాంతాలను ఎవరూనమ్మడం లేదని అన్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు 227 మంది లొంగిపోయారని, పోలీసులు ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధికి ఆకర్షితులై లొంగిపోతున్నారని తెలిపారు. పార్టీలో సీనియర్ల పోకడలు నచ్చక పోవడంతో పాటు పోలీసులు చేపట్టిన ఆపరేషన్ చేయూత కూడా కలిసి వస్తోందన్నారు. ఇప్పుడు లొంగిపోయిన 14 మందిలో వారి స్థాయిని బట్టి రూ.25 వేల నుంచి రూ.లక్ష వరకు ఆర్థిక సాయం అందించామని చెప్పారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 227 మంది మావోయిస్టులు లొంగిపోగా, 130 మందికి రివార్డులు అందించడంతో పాటు పునరావాసం కల్పించామని తెలిపారు. కాలం చెల్లిన సిద్ధాంతాలు అనుసరిస్తున్న మావోయిస్టులు ఏజెన్సీ ప్రాంత అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆరోపించారు. దాడులు, మందుపాతరలను అమర్చడం వంటి చర్యలతో ఆదివాసీలను భయాందోళనలకు గురి చేస్తున్నారని అన్నారు. సమావేశంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్, 81,141 బెటాలియన్ అధికారులు ఆర్ఎస్ శర్మ, కమల్‌వీర్ యాదవ్, చర్ల సీఐ రాజువర్మ, ఎస్సై నర్సిరెడ్డి పాల్గొన్నారు.

ఫలితాలు అథమం.. అధికారుల ఆగ్రహం

- గురుకులాల్లో ఇంటర్ ఉత్తీర్ణత తగ్గడంపై సెక్రటరీ సీరియస్
- ఎనిమిది మందికి షోకాజ్ నోటీసులు జారీ
- త్వరలో పది ఫలితాలపైనా అదే పంథా



విద్యార్థులు (ఫైల్)

భద్రాచలం: ఐటీడీఏ పరిధిలో నిర్వహిస్తున్న గురుకుల కళాశాలల్లో కొన్నిచోట్ల తక్కువ ఫలితాలు నమోదు కావడంపై గురుకులాల సెక్రటరీ కె.సీతాలక్ష్మి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో తక్కువ ఉత్తీర్ణత నమోదైన గురుకుల కళాశాలల ప్రిన్సిపాళ్లతో పాటు సబ్జెక్టు అధ్యాపకులకు తాజాగా షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఇందులో ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో ఎనిమిది మంది నోటీసులు అందుకున్నారు. దీనిపై లిఖిత పూర్వక వివరణతో కూడిన నివేదిక అందజేయాలని ఆదేశించారు. ఆ వివరణ సంతృప్తికరంగా లేకుంటే వారిపై చర్యలు తీసుకునే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు.

పదో తరగతిపైనా పోస్ట్‌మార్టమ్..

ఈ ఏడాది పదో తరగతి ఉత్తీర్ణత శాతం ఆశ్రమ పాఠశాలల్లో మెరుగుపడగా గురుకులాల్లో మాత్రం కొంత తగ్గింది. ఐటీడీఏ పరిధిలో ఉన్న 12 గురుకులాల్లో 849 మందికి 825 ఉత్తీర్ణులై 97.17 శాతం నమోదైంది. 2024లో ఇది 98.90 కాగా, ఈ ఏడాది 1.73 శాతం తక్కువగా ఫలితాలు వచ్చాయి. దీనిపైనా గురుకులం ఉన్నతాధికారులు పోస్ట్‌మార్టమ్ చేస్తున్నారు. కాగా ఇదే ఐటీడీఏ పరిధిలో ఉన్న ఆశ్రమ పాఠశాలల్లో పది ఫలితాలు ఈ ఏడాది కొంత పెరిగాయి. ఐటీడీఏ పరిధిలో 45 ఆశ్రమ పాఠశాలలు, 13 వసతి గృహాలు, ఒక బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో ఈ ఏడాది 93.05 శాతం ఫలితాలు వచ్చాయి. 2024లో ఈ ఫలితాలు 90.60 శాతం కాగా ఈ ఏడాది 2.45 ఉత్తీర్ణత శాతం పెరిగింది. తక్కువ ఫలితాలు నమోదైన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలపై పీఓ రాహుల్ సమీక్షిస్తున్నారు. తక్కువగా నమోదైన వారిపై కఠిన చర్యలు ఉంటాయని గతంలోనే హెచ్చరిక జారీ చేసినప్పటికీ కొందరు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు నిర్లక్ష్యం వహించారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీరికి సైతం త్వరలో షోకాజ్ నోటీసులు జారీ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. 2024లో 11 మంది ప్రధానోపాధ్యాయులకు, 30 మంది సబ్జెక్టు టీచర్లకు నోటీసులు అందజేశారు. కాగా, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, ప్రధానోధ్యాయులు, ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసుల జారీపై ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

సింగరేణి కళాశాలలో అతి తక్కువగా..

ఇటీవల ప్రకటించిన ఇంటర్ మీడియట్ ఫలితాల్లో కొన్ని కళాశాలల్లో ఉత్తీర్ణత ఆశాజనకంగానే ఉండగా, మరికొన్ని చోట్ల తక్కువగా నమోదయ్యాయి. అత్యధికంగా భద్రాచలం స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో 87.32 శాతం ఫలితాలు రాగా, అతి తక్కువగా సింగరేణి కళాశాలలో 34.62 శాతమే నమోదయ్యాయి. ఇంకా తిరుమలాయపాలెంలో 46.34, దమ్మపేటలో 57.58, కృష్ణసాగర్‌లో 62.90 శాతం మేర ఫలితాలు వచ్చాయి. 70 శాతం కంటే తక్కువ ఫలితాలు నమోదైన కళాశాలలపై గురుకుల ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఆయా కళాశాలలపై ఆగ్రహం వ్యక్తం చేసిన సెక్రటరీ.. ప్రిన్సిపాళ్లకు, అధ్యాపకులకు షోకాజ్ నోటీసుల ద్వారా వివరణ అడిగారు. నోటీసులు అందుకున్న వారిలో కృష్ణసాగర్ గురుకుల ప్రిన్సిపాల్, ఇద్దరు అధ్యాపకులు, సింగరేణి గురుకులం ప్రిన్సిపాల్‌తో పాటు మరో అధ్యాపకుడు, దమ్మపేట గురుకుల ప్రిన్సిపాల్, ఇద్దరు అధ్యాపకులకు, తిరుమలాయపాలెం గురుకులం ప్రిన్సిపాల్ ఉన్నారు. కాగా, గుండాల కళాశాల 100 శాతం ఫలితాలు సాధించి అధికారుల అభినందనలు అందుకుంది.

షోకాజ్ నోటీసులు సరికాదు



తక్కువ ఫలితాలు నమోదయ్యాయనే పేరుతో షోకాజ్ నోటీసులు జారీ చేయడం సరికాదు. అన్ని పాఠశాలల్లో చదివే విద్యార్థుల మేధస్సు ఒకేలా ఉండవు. వారిపై స్థానిక పరిసరాల ప్రభావం సైతం ఉంటుంది. ఈ నేపథ్యంలో ఫలితాలనే ప్రామాణికంగా తీసుకుని నోటీసులు జారీ చేయడం సబబు కాదు. ఉత్తమ ఫలితాలను సాధించడానికి ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలి.

– మునిగడప రామాచారి, రిటైర్డ్ ఉపాధ్యాయుడు, టీఎస్‌టీఎఫ్ నేత

షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి



ఇంటర్‌లో తక్కువ ఫలితాలు నమోదైన కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు ఎనిమిది మందికి షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాటిని అందజేశాం. వీటిపై వారు వివరణ అందజేసిన అనంతరం తగు చర్యలు తీసుకుంటాం.

– అరుణకుమారి, గురుకులాల ఆర్సీఓ

10న 'సౌరగిరి'కి శ్రీకారం

- ఇందిరా సౌరగిరి జల వికాసం పథకానికి పైలట్ గ్రామంగా బెండాలపాడు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేతుల మీదుగా ప్రారంభోత్సవం
- ఏర్పాట్లను పర్యవేక్షించిన ఎమ్మెల్యే, ఐటీడీఏ పీఓ



వివరాలు వెల్లడిస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణ, పక్కన పీఓ రాహుల్ తదితరులు

చంద్రుగొండ : రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా చేపట్టిన ఇందిరా సౌరగిరి జల వికాసం పథకానికి ఈనెల 10న శ్రీకారం చుట్టనున్నట్లు ఐటీడీఏ పీఓ బి.రాహుల్, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ తెలిపారు. గిరిజనుల పోడు భూముల్లో సాగునీటి సదుపాయం కల్పన కోసం ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క.. మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన బెండాలపాడులో ప్రారంభిస్తారని వెల్లడించారు. పోడుపట్టాలు పొందిన ప్రతీ రైతుకు 2.5 ఎకరాల భూమిలో రూ. 6 లక్షల వ్యయంతో బోరుబావుల నిర్మించనున్నట్లు తెలిపారు. అంతకంటే తక్కువ భూమి ఉన్నవారికి ఇతర రైతులను అనుసంధానం చేస్తూ బోరు మంజూరు చేస్తారని వివరించారు. పోడుభూముల్లో సాగునీటి సదుపాయంతోపాటు డ్రిప్ ఇరిగేషన్, భూమి అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ప్రధానంగా ఆయిల్‌పామ్ సేద్యం వైపు పోడురైతులను ప్రోత్సహించేందుకు ఈ పథకాన్ని ప్రభుత్వం చేపట్టిందని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీఓ బయ్యారపు అశోక్, నాయకులు భోజ్యానాయక్, ఫజల్, బొర్రా సురేష్, మల్లం కృష్ణయ్య పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి

మణుగూరు రూరల్: నర్సరీల్లోని మొక్కల సంరక్షణకు చర్యలు చేపట్టాలని జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి సిబ్బందికి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయాన్ని మంగళవారం ఆమె పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం తదితర పథకాల అమలుపై సమీక్షించారు. కార్యాలయ ఆవరణలో నిర్మించిన ఇంకుడుగుంతలను, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణకు తిర్లాపురంలో స్థలాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామంలోని నర్సరీని తనిఖీ చేసి మొక్కల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఇమ్మానుయేల్, ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు, ఈజీఎస్ ఏపీఓ అహ్మదుల్లా తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేయండి

ఖమ్మంఅర్బన్: గత సెప్టెంబర్‌లో కురిసిన భారీ వర్షాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో దెబ్బతిన్న సాగునీటి ప్రాజెక్టుల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. హైదరాబాదులో మంగళవారం సీఎంను కలిసిన ఆయన వివరాలు సమర్పించి మాట్లాడారు. అశ్వారావుపేట మండలం పెద్దవాగు ప్రాజెక్టు తాత్కాలిక మరమ్మతులకు రూ.3.50 కోట్లు, శాశ్వత మరమ్మతులకు రూ.90 కోట్లు అవసరమవుతాయని తెలిపారు. రెండు రాష్ట్రాల్లో ఆయకట్టు ఉన్నందున ఏపీ ప్రభుత్వంతో చర్చించి తెలంగాణ నుంచి అవసరమైన నిధులు కేటాయించాలని కోరారు. అంతేకాక చంద్రుగొండ మండలం సీతాయిగూడెంలోని వెంగళరాయసాగర్ ప్రాజెక్టు మరమ్మతులకు సైతం నిధులు మంజూరు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

అంచనాలు ఆమోదించండి..

సీతారామ ఎత్తిపోతల పథకానికి సంబంధించి సవరించిన అంచనాలను ఆమోదించి పనుల్లో వేగం పెరిగేలా సమీక్షించాలని సీఎంను మంత్రి తుమ్మల కోరారు. ఈ అంచనాలు ఆర్థిక శాఖ పరిశీలనలో ఉన్నందున, పరిపాలనా అనుమతులు వస్తే పనులు ప్రారంభించవచ్చని తెలిపారు. సీతారామతో పాటు సీతమ్మ సాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టులు పూర్తయితే ఉమ్మడి ఖమ్మంతో పాటు మహబూబాబాద్ జిల్లాకు గోదావరి జలాలు అందుతాయని వెల్లడించారు.

క్లుప్తంగా

కార్మికుల ప్రాణాలకు రక్షణగా ఉండాలి..



శిక్షణను ప్రారంభిస్తున్న జీఎం శాలేంరాజు

సింగరేణి(కొత్తగూడెం): సంస్థ నిర్వహించే రెస్క్యూ శిక్షణలో ప్రావీణ్యం సాధించి, కార్మికుల ప్రాణాలకు రక్షణగా ఉండాలని ఏరియా జీఎం ఎం.శాలేంరాజు పేర్కొన్నారు. సోమవారం కొత్తగూడెం ఏరియా పరిధిలోని 3 ఇంక్‌లైన్‌లోని రెస్క్యూ స్టేషన్‌లో తొలిసారిగా మహిళలకు ఇస్తున్న శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించి, మాట్లాడారు. ఈ శిక్షణకు ముందు బేసిక్ టెస్ట్ ఉంటుందని, అందులో ఉత్తీర్ణులైనవారికే శిక్షణ ఇస్తారని, ఒక్క ట్రెయినీ సుమారు 10 మంది ప్రాణాలను కాపాడే నైపుణ్యం సంపాదించే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సేఫ్టీ జీఎం చింతల శ్రీనివాస్, ఎస్‌ఓటూ జీఎం కోటిరెడ్డి, వెంకటేశ్వర్లు, డాక్టర్ శ్రీనివాసరెడ్డి, అనంత రామయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉమ్మడి జిల్లాస్థాయి చెస్ ఎంపికలు

ఖమ్మంస్పోర్ట్స్: ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఈ నెల 8న ఉమ్మడి జిల్లాస్థాయి చెస్ క్రీడాకారుల ఎంపిక ఉంటుందని ఆర్గనైజర్ సీహెచ్.గోపి తెలిపారు. చెస్ అసోసియేషన్ ఆధ్వర్యాన అండర్ – 7, 9, 11 విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. క్రీడాకారులు వివరాలకు 94401 62749 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

గ్రామాల్లో డీపీఓ పర్యటన



పనులను పరిశీలిస్తున్న డీపీఓ చంద్రమౌళి

జూలూరుపాడు: మండలంలోని పలు గ్రామాల్లో జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) చంద్రమౌళి పర్యటించారు. కొమ్ముగూడెం, శంభునిగూడెం, అనంతారం,గుండెపుడి,జూలూరుపాడుల్లో జరుగుతున్న ఇంకుడుగుంతల నిర్మాణ పనులను పరిశీలించారు.త్వరితగతిన పూర్తి అయ్యేలా చూడాలని పంచాయతీ సెక్రటరీలను ఆదేశించారు. వర్షాకాలంలో నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలు పెంచడానికి ఇంకుడుగుంతలు ఉపయోగపడతాయన్నారు. ఎంపీఓ తులసిరామ్, పంచాయతీ సెక్రటరీలు ఖాదర్‌మియా, శ్రీహరి, సతీశ్, శైలజ, రవి పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

అశ్వారావుపేటరూరల్: పేకాట స్థావరంపై మంగళవారం స్థానిక పోలీసులు దాడి చేశారు. ట్రెయినీ ఎస్‌ఐ అఖిల కథనం ప్రకారం.. స్థానిక మోడల్‌కాలనీలోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.2,300 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని ట్రెయినీ ఎస్‌ఐ తెలిపారు.

వేధింపులకు పాల్పడిన వ్యక్తికి ఏడాది జైలు

భద్రాచలంఅర్బన్: ఓ మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడిన భద్రాచలం పట్టణానికి చెందిన లక్ష్మణ్‌కు ఏడాది జైలుశిక్షతోపాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ భద్రాచలం ప్రథమశ్రేణి న్యాయమూర్తి శివనాయక్ మంగళవారం తీర్పు చెప్పారు. తనను లక్ష్మణ్ లైంగికంగా వేధిస్తున్నాడని 2022లో భానుమతి అనే మహిళ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. టౌన్ సీఐ కేసు నమోదు చేసి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.

రెండు బైకులు ఢీ

ఒకరు మృతి.. ఐదుగురికి తీవ్ర గాయాలు



ఉపేంద్ర (ఫైల్)

దమ్మపేట: ఆగి ఉన్న బైకును ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం బలంగా ఢీకొట్టిన ఘటనలో రోడ్డుపై నిలబడి ఉన్న యువకుడు మృతి చెందగా, ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని పార్కలగండి శివారులో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని జగ్గారం సమీపంలోని గుర్వాయిగూడెంనకు చెందిన వగ్గెల వంశీ, జగ్గారం గ్రామానికి చెందిన సోయం సిద్ధార్థ, మణుగూరుకు చెందిన కొమరం చందు డ్యూక్ బైక్‌పై జగ్గారం నుంచి దమ్మపేటలో జరుగుతున్న ముత్యాలమ్మ జాతరకు వస్తున్నారు. అన్నపురెడ్డిపల్లి మండలం కొండాయిగూడెం గ్రామానికి చెందిన జేసీబీ డ్రైవర్ మిడియం దుర్గారావు, చీపురుగూడెం గ్రామానికి చెందిన బొక్కా ఉపేంద్ర (21)తో కలిసి దమ్మపేట వైపునకు బైక్‌పై వస్తున్నారు. పార్కలగండి శివారులో బైకును ఆపి రోడ్డుపై నిలబడ్డారు. మరో ఇద్దరు పల్సర్ బైక్‌పై వెళ్తూ ఉపేంద్రను అంబర్ కావాలని అడిగారు. ఉపేంద్ర వారికి అంబర్ ఇవ్వబోతుండగా వగ్గెల వంశీ బైక్‌ను వేగంగా నడుపుకుంటూ వచ్చి ఉపేంద్రతో పాటు ఆగి ఉన్న బైక్‌ను బలంగా ఢీకొట్టాడు. ఉపేంద్ర అక్కడికక్కడే మృతి చెందగా.. డ్యూక్ బైక్‌పై ఉన్న ముగ్గురు, పల్సర్‌పై ఉన్న మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను 108 ద్వారా అశ్వారావుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

లైన్ క్లియరెన్స్ ఇక సులభం

- నూతన యాప్‌ను ప్రవేశపెట్టిన టీజీఎన్పీడీసీఎల్
- ఉద్యోగులకు తప్పనున్న ఇబ్బందులు
- అధికారులు, ఉద్యోగులకు శిక్షణ



ఎల్సీ యాప్‌పై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న దృశ్యం (ఫైల్)

భద్రాచలంఅర్బన్: విద్యుత్ వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన సేవలందించేందుకు టీజీఎన్పీడీసీఎల్ ఆధునిక సాంకేతిక పద్ధతులను అవలంబిస్తోంది. ఈ క్రమంలో లైన్ క్లియరెన్స్ (ఎల్సీ) మరింత బాధ్యతగా, సులభంగా ఉండేలా చర్యలు చేపట్టింది. ఒక్క ఫోన్ కాల్ ద్వారా ఎల్సీ తీసుకోవడంతో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. విద్యుత్ ప్రమాదాలతో ప్రాణనష్టం జరుగుతోంది. ఈ సమస్యను అధిగమించేందుకు ఎల్సీ (ఫీడర్లలో విద్యుత్ సరఫరా నిలిపివేత, పునరుద్ధరణ) తీసుకోవడానికి ప్రత్యేక యాప్‌ను ఎన్పీడీసీఎల్ యాజమాన్యం రూపొందించింది. ఇప్పటివరకు ఎల్సీ తీసుకుంటే.. సబ్ స్టేషన్ ఆపరేటర్‌కు, తీసుకున్న ఉద్యోగికి మాత్రమే తెలిసేది. ఈ యాప్ ద్వారా ఏఈ, ఏడీఈ, డీఈలు కూడా తెలుసుకునే వీలు కలగడంతోపాటు పర్యవేక్షణ పెరుగుతుంది. ఫీడర్ల ఎంపికలోనూ కచ్చితత్వం ఉంటుంది.

ఏఈ పర్యవేక్షణ..

ఈ యాప్‌ను ఏఈలు పర్యవేక్షిస్తారు. సిబ్బంది ఏ ఫీడర్ వద్ద పనిచేస్తున్నారో అందులో సమాచారం ఇవ్వాలి. లైన్‌మెన్ యాప్‌ను తెరిచి సంబంధిత ఫీడర్లో ఎల్సీ కావాలని ఏఈకి సమాచారం పంపాలి. దాన్ని ఏఈ పరిశీలించి నిర్ణయం తీసుకుంటారు. సమాచారాన్ని అక్కడున్న లైన్‌మెన్‌కు చేరవేస్తారు. సంబంధిత ఉప కేంద్రం ఫీడర్ ఆపరేటర్‌కు యాప్ ద్వారా వివరాలు వెళ్తాయి. దాన్ని పరిశీలించిన అనంతరం ఆ ఫీడర్‌కు సంబంధించిన లైన్ క్లియరెన్స్ (ఎల్సీ) ఇస్తారు.

సూచనలిస్తూ..

పొరపాట్లను నివారించేందుకు తగు సూచనల్ని యాప్ ఇస్తుంది. హెల్మెట్ ధరించాలని, హ్యాండ్ గ్లౌజ్ వేసుకోవాలని, ఎర్త్ రాడ్ వాడాలని, ఏబీ స్విచ్ ఓపెన్ చేశారా? లేదా అనే జాగ్రత్తలను యాప్ గుర్తు చేస్తుంది. ఎక్కడైనా డబుల్ ఫీడింగ్ ఉందా? ఈ ఫీడర్‌కు వేరే ఫీడర్ అనుసంధానం ఉందా? వంటి సమాచారాన్ని తెలియజేస్తుంది. దీని ద్వారా జాగ్రత్త పడుతూ ప్రాణనష్టాన్ని నివారించవచ్చు. డబుల్ ఫీడింగ్ ఉంటే రెండు ఫీడర్లలో ఎల్సీ తీసుకోవడమా? లేదా ఇతరత్రా జాగ్రత్తలు తీసుకువచ్చా? అని బేరీజు వేసుకుని పనులు చక్కదిద్దుతారు. ఎల్సీ తీసుకున్న ఫీడర్లో పనులు పూర్తి కాగానే యాప్‌లో ఆ సమాచారాన్ని లైన్‌మెన్ పొందుపర్చి విద్యుత్ సరఫరా పునరుద్ధరించవచ్చనే సంకేతాన్ని, సమాచారాన్ని యాప్ ద్వారా చేరవేస్తారు. దీన్ని సంబంధిత సెక్షన్ ఏఈ పరిశీలించి సబ్‌స్టేషన్ ఆపరేటర్‌కు చేరవేస్తారు. దీంతో ఎల్సీ తీసుకున్న ఫీడర్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తారు.

ప్రమాదాల నివారణకే..



విద్యుత్ వినియోగదారులకు మరింత ఉత్తమ సేవలు అందించడంలో భాగంగా భద్రతా ప్రమాణాలను పెంచడానికి ప్రత్యేకంగా ఎల్సీ యాప్‌ను టీజీఎన్పీడీసీఎల్ యాజమాన్యం రూపొందించింది. ఎల్సీ యాప్ ద్వారా విద్యుత్ అంతరాయాల సమయాలు, మానవ తప్పిదాలను అరికట్టవచ్చు. విద్యుత్ ప్రమాదాలు, ప్రాణనష్టాన్ని నివారించవచ్చు. దీంతో భవిష్యత్‌లో ఎలాంటి ప్రమాదాలు జరగవు.

–మహేందర్, ఎస్ఈ, భద్రాద్రి కొత్తగూడెం

వేబ్రిడ్జి తూకంలో గోల్‌మాల్..?

నష్టపోయిన పలువురు వ్యాపారులు

సుజాతనగర్: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఓ కాంటాలో రెండు నెలలుగా జరిగిన ఓ మోసం మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తూకాల్లో మోసానికి ఒడిగట్టి కాంటా ఆపరేటర్లు, దళారులు లాభపడినట్లు తెలుస్తోంది.మండల కేంద్రంలో ప్రధాన రహదారి పక్కన కొందరు ప్రైవేట్ వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి పత్తిని విక్రయిస్తుంటారు. ఈ మార్కెట్‌కు సమీపంలో ఓ వేబ్రిడ్జి ఉంది. అందులో పనిచేసే ఇద్దరు ఆపరేటర్లు రెండు నెలలుగా 'ఇంటర్నల్ లాకింగ్'సిస్టంతో మోసానికి పాల్పడినట్లుగా తెలుస్తోంది. దళారులు ట్రాలీ వాహనాల్లో తెచ్చిన పత్తి తూకం కంటే అదనంగా బిల్లులు ఇస్తూ మోసానికి పాల్పడ్డారంటూ నష్టపోయిన వ్యాపారులు ఆరోపిస్తున్నారు. ఒక్కో వాహనానికి 100 నుంచి 150 కిలోల తూకాన్ని తేడాగాచూపించారని వ్యాపారులు వాపోయారు. ఇలారూ.30 లక్షలమేర అదనంగా చెల్లించి నష్టపోయామని తెలిపారు.పోలీసులకు ఫిర్యాదు చేశామని వ్యాపారులు శేఖర్, భీమ్లా తెలిపారు.

కేదార్‌నాథ్ యాత్రలో విషాదం

- అశ్వారావుపేట వాసి మృతి
- ఆలయ సమీపంలో గుండెపోటుతో ప్రాణాలు కోల్పోయిన భక్తుడు



మరణానికి కొన్ని గంటల ముందు కేదార్‌నాథ్ యాత్రలో వెంకటేశ్వరరావు

అశ్వారావుపేట : అశ్వారావుపేటకు చెందిన కొందరు కేదార్‌నాథ్ యాత్రకు వెళ్లగా అందులో ఓ భక్తుడి యాత్ర విషాదాంతమైంది. ద్వాదశ జ్యోతిర్లింగ దర్శనం కోసం అశ్వారావుపేట నుంచి ఆరుగురు భక్తులు ఈనెల 1వ తేదీన కారులో బయలుదేరారు. 11 యాత్రలు ముగించుకుని చివరిదైన కేదార్‌నాథ్‌కు సోమవారం ఉదయం చేరుకున్నారు. కింది భాగంలోని గౌరీకుండ్ నుంచి 8 గంటలకు కొందరు పాదయాత్ర ప్రారంభించగా మరి కొందరు గుర్రాలు, డోలీలపై వెళ్లారు. ఈ క్రమంలో పాదయాత్ర చేస్తున్న అశ్వారావుపేటకు చెందిన వ్యాపారి గుత్తికొండ వెంకటేశ్వరరావు(47).. 17 కిలోమీటర్ల పాదయాత్ర చేసి రాత్రి 9 గంటలకు ఆలయ సమీపానికి చేరుకున్నాడు. కాగా, మధ్యలో ఆయాస పడుతూనే ఉన్నాడని పక్కనున్న భక్తులు తెలిపారు. ఎట్టకేలకు యాత్ర పూర్తి చేసి క్షేత్రానికి చేరువలోకి వెళ్లాక సహచరులతో కలిసి భోజనం చేసి టెంట్ కింద పడుకున్నాడు. మంగళవారం ఉదయం 5 గంటలకు అభిషేకానికి వెళ్లేందుకు వెంకటేశ్వరరావును నిద్ర లేపేందుకు పక్కవారు ప్రయత్నించగా ఎంతకూ స్పందించకపోవడంతో సమీపంలోని వైద్యులకు చూపించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఈ విషయాన్ని మిలటరీ అధికారులకు తెలియజేయగా మృతదేహాన్ని హెలికాప్టర్‌లో గౌరీకుండ్‌కు తరలించారు. అక్కడి నుంచి రుద్ర ప్రయాగలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. సాయంత్రానికి పోస్టమార్టం పూర్తి చేసి సహచర భక్తులకు మృతదేహాన్ని అప్పగించారు. అక్కడి నుంచి మంగళవారం రాత్రి 9 గంటలకు బయలుదేరగా.. 2వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న అశ్వారావుపేటకు బుధవారం రాత్రి వరకు చేరుకోవచ్చని అంటున్నారు. వెంకటేశ్వరరావు మరణ వార్త తెలియడంతో ఇంటివద్ద భార్య, పిల్లలు, బంధువుల రోదనలు మిన్నంటాయి.

నెరవేరని చివరి కోరిక..

ఆరుగురు భక్తులు ద్వాదశ జ్యోతిర్లింగాలలో 11 యాత్రలు ముగించుకుని చివరిది, కఠోరమైన కేదారినాథ్‌కు చేరుకున్నారు. కేదార్‌నాథ్ దర్శనం తర్వాత బద్రీనాథ్ వెళ్లాలని, అక్కడ తన తల్లిదండ్రులకు పిండ ప్రదానం చేయాలని వెంకటేశ్వరరావు చెప్పాడని సహచరులు తెలిపారు. దీంతో పాటు తనకు కుమారులు లేనందున తాను కూడా ఆత్మ పిండ ప్రదానం చేసుకోవాలని చెప్పాడని, అయితే చివరి కోరిక నెరవేరకుండానే తుదిశ్వాస విడిచాడని విలపించారు.

యువకుడి మృతదేహం వెలికితీత



సమాధిని తొలగిస్తున్న దృశ్యం

జూలూరుపాడు: పూడ్చి పెట్టిన యువకుడి మృతదేహాన్ని పోలీసులు వెలికి తీసిన ఘటన మంగళవారం జూలూరుపాడులో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. జూలూరుపాడు ఎస్సీకాలనీకి చెందిన కత్తి రాములు, నాగమణి దంపతుల కుమారుడు కత్తి అరవింద్ (26) ఇటీవల మృతి చెందగా.. మృతిపై అనుమానాలున్నాయని తండ్రి రాములు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తహసీల్దార్ స్వాతిబిందు సమక్షంలో జేసీబీ సాయంతో సమాధి తొలగించి పూడ్చిపెట్టిన మృతదేహాన్ని వెలికితీశారు. ఫోరెన్సిక్ నిపుణులు రమణమూర్తి ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రవి, సీఐ ఇంద్రసేనారెడ్డి వివరాలు వెల్లడించారు. ఐదు నెలల కిందట అరవింద్‌కు ఏన్కూర్‌కు చెందిన సింధుతో వివాహమైంది. గత నెల 1వ తేదీన పుట్టింటికి వెళ్లిన సింధు అత్తగారింటికి వచ్చింది. ఏప్రిల్ 2న ఫ్రైడ్ రైస్, నూడుల్స్ తిన్న అరవింద్ విరేచనాలు, వాంతులు కావడంతో ఆర్‌ఎంపీ వద్ద చికిత్స చేయించారు. 7వ తేదీన అరవింద్ తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కొత్తగూడెం ఆస్పత్రికి తరలించగా.. ఐదు రోజుల అనంతరం ఖమ్మం ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ 16న మృతి చెందాడు. కాగా, ఈ నెల 4న మృతుడి తండ్రి రాములు ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని వెలికితీసి, తహసీల్దార్ సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించామని సీఐ పేర్కొన్నారు. ఎస్‌ఐ రవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌ఐ సీహెచ్ ఆదినారాయణ, పంచాయతీ సెక్రటరీలు హరిబాబు, లక్ష్మణ్, పోలీసులు పాల్గొన్నారు.

వేడుక చేసుకున్న కాసేపటికే యువకుడు మృతి

మద్యం మత్తులో డాబా పైనుంచి పడి..



నూతేశ్ స్వీన్ మృతదేహం

పాల్వంచ: పుట్టినరోజు కావడంతో పార్టీ చేసుకున్న కొద్ది సమయంలోనే ఓ యువకుడు డాబా పైనుంచి పడి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. ఒడిశా రాష్ట్రం భద్రక్ జిల్లా అహర్‌పడా గ్రామానికి చెందిన నూతేశ్ స్వీన్ (26) నటరాజ్‌సెంటర్‌లోని ఓ బార్‌లో వంటమాస్టర్‌గా పనిచేస్తున్నాడు. స్నేహితుడు హిమాన్షుతో కలిసి ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. సోమవారం నూతేశ్ స్వీన్ పుట్టినరోజు కావడంతో అర్ధరాత్రి వరకు స్నేహితులిద్దరూ కలిసి మద్యం తాగారు. హిమాన్షు వారి గదిలోనే పడుకోగ, నూతేశ్ స్వీన్ డాబాపై పడుకునేందుకు 1.30 గంటల సమయంలో రెండు అంతస్తుల డాబాపైకి ఎక్కాడు. అక్కడి నుంచి ప్రమాదవశాత్తు కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మంగళవారం ఉదయం పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించి, మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం తరలించారు. హిమాన్షు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కల్యాణి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి హామీ సిబ్బందికి ఊరట

మూడు నెలలు వేతనాలు విడుదల

చుంచుపల్లి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న సిబ్బందికి ఊరట లభించింది. రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు మూడు నెలల వేతనాలను మంగళవారం విడుదల చేసింది. ఏప్రిల్‌కు సంబంధించిన వేతనాన్ని మాత్రం పెండింగ్‌లో ఉంచింది. ఉపాధి హామీ పథకం అమలులో ఏపీఓలు, ఇంజనీరింగ్ కన్సల్‌టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు కీలక పాత్ర పోషిస్తున్నారు. వీరికి కొంతకాలంగా సకాలంలో వేతనాలు అందడం లేదు. నాలుగు నెలలుగా వేతనాలు అందకపోవడంతో నిరసనలతో పాటు ఇటీవల పెన్‌డౌన్ నిర్వహించారు. వీరి సమస్య ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో ఎట్టకేలకు జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు సంబంధించి వేతనాలను విడుదల చేసింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉపాధి హామీ పథకంలో 839 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. వేతనాలు పడటంతో ఉద్యోగులు ఊపిరి పీల్చుకున్నారు.

ఫారెస్ట్ సిబ్బందిపై దాడికి యత్నం



అటవీ సిబ్బందిని అడ్డుకుంటున్న గొత్తికోయలు

చుంచుపల్లి: రామవరం రేంజ్, పెనగడప సెక్షన్ పరిధిలోని జగ్గారం గ్రామం అటవీ ప్రాంతంలో రేంజ్ ఆఫీసర్ ఎల్లయ్య, సెక్షన్ ఆఫీసర్ సలూజా, బీట్ అధికారులతో మంగళవారం ఫుట్ పెట్రోలింగ్ నిర్వహిస్తూ సరిహద్దులు పరిశీలిస్తున్న క్రమంలో అదే గ్రామానికి చెందిన గొత్తికోయలు దాడి చేసేందుకు యత్నించారు. కొందరు అటవీ సిబ్బంది తప్పించుకుని బయటపడ్డారు. ఈ ఘటనపై కొత్తగూడెం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అడవి గేదెల దాడిలో ఇద్దరికి గాయాలు

సత్తుపల్లిరూరల్: రహదారిపై వెళ్తున్న ఆటోకు అడ్డుగా వచ్చిన అడవి గేదెలు దాడి చేయటంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలం పెనగడప నుంచి పలువురు కూలీలు మంగళవారం సత్తుపల్లికి బయలుదేరారు. ఈ ఆటో యాతాలకుంట వద్ద రోడ్డు దాటుతుండగా, పక్క నుంచి అడవి గేదెలు దూసుకొచ్చి ఢీకొన్నాయి. దీంతో ఆటోలో ఉన్న పల్లపు రాజు, బోసు ఓదేలుకు గేదెల కొమ్ములు తాకడంతో తీవ్ర గాయాలు కాగా సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

బెదిరింపు ఫోన్‌పై కేసు నమోదు

కొత్తగూడెంటౌన్: సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీగా విధులు నిర్వర్తిస్తున్న గుండా శ్రీనివాస్‌కు గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై మంగళవారం కొత్తగూడెం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ కరుణాకర్ కథనం ప్రకారం.. తనకు తెలిసిన ఓ మహిళను సింగరేణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ను చేయాలని, తాను మంత్రి అనుచరుడినని సింగరేణి ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్‌లో సెక్రటరీగా పనిచేస్తున్న గుండా శ్రీనివాస్‌కు గుర్తు తెలియని వ్యక్తి (రఘు) ఫోన్ చేసి బెదిరించాడు. శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఏసీబీ అదుపులో సింగరేణి ఉద్యోగి



ఏసీబీ అదుపులో ఉన్న రాజేశ్వరరావు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా పరిధిలోని మెయిన్ వర్క్‌షాపులో డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్న అన్నెబోయిన రాజేశ్వరరావును మంగళవారం అదుపులోకి తీసుకున్నామని ఏసీబీ డీఎస్పీ రమేశ్ తెలిపారు. ఇల్లెందు గెస్ట్‌హౌజ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మెడికల్ ఇన్‌వాలిడేషన్‌కు దరఖాస్తు చేసుకున్న సింగరేణి ఉద్యోగుల వివరాలు తెలుసుకొని డబ్బులు వసూలు చేశాడని, ఉద్యోగాలు పెట్టిస్తానని అమాయకులను వలలో వేసుకొని వారి వద్ద నుంచి డబ్బులు వసూలు చేసినట్లు సింగరేణి విజిలెన్స్ విచారణలో తేలిందని తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు రాజేశ్వరరావును అదుపులోకి తీసుకున్నామని, ఆయన బ్యాంకు ఖాతాల్లోకి రూ.32 లక్షలు లావాదేవీలు నడిచాయని తెలిపారు. రేపు ఆయన్ను వరంగల్‌లోని మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరుస్తామని, దీని వెనుక మరికొందరు ఉన్నట్లు తెలిసిందని, వివరాలు సేకరించి వారిని కూడా అదుపులోకి తీసుకుంటామని ఏసీబీ డీఎస్పీ వివరించారు.

ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

దుమ్ముగూడెం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న కృష్ణమ్మ ఎలుకలమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. మండల ప్రజా పరిషత్ అధికారులు, సిబ్బంది వేధింపులకు గురిచేస్తున్నారని, దీంతోపాటు మెమో జారీ చేయడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ఆమె తెలిపింది. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి మెరుగ్గానే ఉన్నట్లు సమాచారం. కాగా ఈ ఘటనపై ఎంపీడీఓ బద్ది రామకృష్ణ వివరణ కోరగా.. కార్యాలయంలో విధులు సక్రమంగా నిర్వర్తించకపోవడంతో మెమో జారీ చేశామని, గతంలో కూడా పలుమార్లు మెమోలు జారీ చేశామని వాటికి సమాధానం కూడా ఇవ్వలేదని తెలిపారు.

డిస్ట్రిబ్యూటర్ కెనాళ్లు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్

పాల్వంచరూరల్: సీతారామ ప్రాజెక్టుకు డిస్ట్రిబ్యూటర్ కెనాళ్లను ఏర్పాటు చేయాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ అన్నారు. మండలంలోని పెద్దమ్మగుడి సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్లో మంగళవారం జరిగిన జిల్లా వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. సీతారామ ప్రాజెక్టుకు డిస్ట్రిబ్యూటర్ కెనాళ్లను ఏర్పాటు చేయకపోతే జిల్లా ఎండిపోయే ప్రమాదం ఉందని, జిల్లా నుంచి నీరు పోతున్నా జిల్లాకు చుక్కనీరు ఇవ్వకపోతే ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. ఈ సమస్యపై ఈ నెల 20 వరకు ఊరూరా గ్రామసభల నిర్వహణ, 30న మండలస్థాయిలో ధర్నాలు, అనంతరం కలెక్టరేట్‌ను దిగ్బంధిస్తామని వెల్లడించారు. సమావేశంలో మచ్చా వెంకటేశ్వర్లు, అన్నారపు కనకయ్య, అన్నారపు సత్యనారాయణ, దొడ్డ లక్ష్మీనారాయణ, కొండబోయిన వెంకటేశ్వర్లు, రవికుమార్, సత్యనారాయణ, కేశవరావు, తిరుపతిరావు, శ్రీకాంత్, శంకర్ పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్ నిలిపివేయాలి



మాట్లాడుతున్న పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు

మణుగూరుటౌన్: కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులను అంతమొందించేందుకు చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని, మావోయిస్టులను శాంతి చర్చలకు పిలవాలని అఖిలపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలు పార్టీల నాయకులు మాట్లాడారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ మావోలతో చర్చలు జరిపేది లేదని కగార్ ఆపరేషన్‌ను వెనక్కు తీసుకోబోమని మాట్లాడటం విక్రత చర్య అని, నియోజకవర్గంలో తాజా, మాజీ ఎమ్మెల్యేలు ఆపరేషన్ కగార్ పేరుతో అమాయక గిరిజనుల హత్యలు చేస్తున్నా మాట్లాడకపోవడం విచారకరమన్నారు. ఈ నెల 12వ తేదీన అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సాయంత్రం 4 గంటలకు జరిగే శాంతి ర్యాలీని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో అఖిలపక్ష నాయకులు అయోధ్య, నెల్లూరు నాగేశ్వరరావు, ఏనుగు చంద్రం, రూపురెడ్డి మధుసూదన్‌రెడ్డి, సువర్ణపాక నాగేశ్వరరావు, వజ్జా జ్యోతిబసు, ఇమామ్, సిరాజ్, నూరుద్దీన్, సరెడ్డి పుల్లారెడ్డి, మున్నాలక్ష్మీకుమారి, సత్రపల్లి సాంబశివరావు, దుర్గోగ్యల సుధాకర్, జక్కుల రాంబాబు, కోమరం గణేశ్ తదితరులు ఉన్నారు.

34 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న సీఐ కరుణాకర్

కొత్తగూడెంటౌన్: ఏపీ నుంచి ఛత్తీస్‌గఢ్‌కు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని కొత్తగూడెంలో పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ కరుణాకర్ వివరాలు వెల్లడించారు. రైటర్‌బస్తీలో ఎస్‌ఐ విజయలక్ష్మి సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేపట్టారు. అటుగా వచ్చిన లారీని ఆపి తనిఖీ చేయగా.. రేషన్ బియ్యం దొరికాయి. రూ.12.36 లక్షల విలువైన 687 బస్తాల్లోని 34 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఛత్తీస్‌గఢ్‌కు తరలిస్తున్నామని ఏపీలోని ఏలూరు జిల్లా చింతలపూడికి చెందిన చప్పిడి వెంకటకృష్ణ, లింగపాలెంకు చెందిన చల్లాగుల రామ్మోహన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం గరియాబాద్ జిల్లా రాజీం మండలం జెంక్రా గ్రామానికి చెందిన భువనేశ్వర్ సాహు, అదే మండలానికి చిత్తరంజన్ తారక్‌లు విచారణలో తెలిపారు. ఆ నలుగురిని అదుపులోకి తీసుకున్నామని, ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా తిరువూరుకు చెందిన చిట్టెల రమకనకాచారి, నాగరాజు (డ్రైవర్), పరమ్ ప్రీత్‌సింగ్ (లారీఓనర్), కృతిక గోస్వామి పరారీలో ఉన్నారని సీఐ తెలిపారు. ఈ ఎనిమిది మందిపై కేసు నమోదు చేశామని సీఐ ఎం.కరుణాకర్ తెలిపారు.